క్లుప్తంగా

చదరంగం క్రీడతో నైపుణ్యాభివృద్ధి



విద్యార్థికి చెస్ బోర్డు బహుమతిగా అందజేస్తున్న ప్రిన్సిపాల్ శ్రీలక్ష్మి

నల్లజర్ల: చదరంగంలో మక్కువ ఉండి చెస్ నేర్చుకోవడానికి ఆశక్తి ఉన్న బాల, బాలికలకు చెస్ అసోసియేషన్ ద్వారా శిక్షణ ఇస్తున్నట్లు దూబచర్లలోని ఎలైట్ స్కూల్ ప్రిన్సిపాల్ కలగర శ్రీలక్ష్మి తెలిపారు. ఆదివారం అంతర్జాతీయ చెస్ దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం పాఠశాలలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ చెస్ నేర్చుకోవడంతో ఏకాగ్రత, సమస్య పరిష్కార నైపుణ్యాలు, సృజనాత్మకత, నిర్ణయం తీసుకునే సామర్థ్యం పెరుగుతుందన్నారు. జీవితంలో గెలవడమో, ఓడిపోవడమో చదరంగం నేర్పుతుందన్నారు. గెలవడం అందరికి ఇష్టమే కాని ఓటమిని ఎలా అంగీకరించాలో నేర్చుకోవడం కూడ మనిషికి ముఖ్యమన్నారు. విద్యార్థులకు చెస్ పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కోచ్ ,సీనియర్ నేషనల్ ఆర్బిటర్ కిరణ్‌కుమార్, కోచ్ శ్యామల పాల్గొన్నారు.

పశ్చిమడెల్టాకు 7,200 క్యూసెక్కులు

నిడదవోలు: రైతుల వ్యవసాయ అవసరాల నిమిత్తం జలవనరుల శాఖ ధవళేశ్వరం హెడ్‌వర్క్స్ అధికారులు పశ్చిమడెల్టా ప్రధాన కాలువకు క్రమబద్ధీకరిస్తున్నారు. పశ్చిమడెల్టా శివారు ప్రాంతాలను సాగునీరందించేందుకు నీటి విడుదలను రోజు రోజుకి పెంచుతున్నారు. నిడదవోలు మండలం విజ్జేశ్వరం హెడ్ స్లూయిజ్ నుంచి శనివారం అత్యధికంగా 7,200 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం గోదావరి నీటి మట్టం 13.99 మీటర్లు నమోదయ్యింది. పశ్చిమడెల్టా పరిధిలో ఉప కాలువలకు కూడా నీటి విడుదల పెంచారు. నరసాపురం కాలువకు 2,321 క్యూసెక్కులు, తణుకు కాలువకు 695 క్యూసెక్కులు, ఏలూరు కాలువకు 1,223 క్యూసెక్కులు, ఉండి కాలువకు 1,550 క్యూసెక్కులు, అత్తిలి కాలువకు 532 క్యూసెక్కుల చొప్పున విడుదల చేస్తున్నామని ప్రాజెక్ట్ అధికారులు వివరించారు.

18 ఏళ్లు నిండిన తరువాతే వివాహం చేసుకోవాలి

ఉండ్రాజవరం: ఆడపిల్లలు 18 ఏళ్లు నిండిన తరువాతే వివాహం చేసుకోవాలని వడ్లూరు ఉన్నత పాఠశాల హెచ్‌ఎం వెంకటలక్ష్మి అన్నారు. కిషోర బాలికల వికాస కార్యక్రమంలో భాగంగా మండలంలో వడ్లూరు ఉన్నత పాఠశాలలో శనివారం విద్యార్థులు కౌమార దశలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సమావేశం నిర్వహించారు. బాల్య వివాహాల వలన సంభవించే నష్టాలు, వివాహాలు చేసుకుంటే ప్రభుత్వం విధించే శిక్షలపై అవగాహన కల్పించారు. డాన్ బాస్కో నవజీవన్ బాల భవన్ ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా సీఎస్‌ఎన్ కోఆర్డినేటర్ శ్రీతేజ ప్రస్తుతం జరుగుతున్న సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. పోక్సో చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. అంగన్‌వాడీ టీచర్లు పద్మావతి, లక్ష్మీ, సుందరమ్మ, స్వర్ణకుమారి, ఆయాలు పాల్గొన్నారు.

రూ.50 లక్షల బీమా సొమ్ము అందజేత



తాళ్లపూడి యూనియన్ బ్యాంక్‌లో బీమా చెక్కును అందజేస్తున్న మేనేజర్

తాళ్లపూడి: గోపాలపురం మండలం గోపవరంకు చెందిన జాలిపర్తి సుధీర్, సగ్గొండ ఆంధ్రా షుగర్స్ ఫ్యాక్టరీలో ఉద్యోగం చేస్తున్నాడు. ఆయన ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. యూనియన్ బ్యాంక్ తాళ్లపూడి శాఖలో శాలరీ అకౌంట్ ఖాతాదారుడిగా ఉండి ప్రమాద బీమా పథకంలో ఆయన చేరడంతో కుటుంబ సభ్యులకు రూ.20 లక్షలు ఉచిత ప్రమాద బీమా నగదును బ్యాంక్ మేనేజర్ బి.రాజు సిబ్బంది సమక్షంలో శనివారం చెక్కును అందజేశారు. అదనంగా మరో రూ.30 లక్షలు కలిపి మొత్తం రూ.50 లక్షల సొమ్మును వారి కుటుంబ సభ్యులకు అందించామన్నారు. ఆంధ్రా షుగర్స్ లిమిటెడ్ జీఎం .ముళ్లపూడి శ్రీనివాస్ పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

నిడదవోలు రూరల్: పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన వ్యక్తి చికిత్స పొందుతూ శనివారం మృతి చెందినట్లు సమిశ్రగూడెం ఎస్సై ఎల్.బాలాజీ సుందరరావు తెలిపారు. పోలీసుల వివరాల ప్రకారం నిడదవోలు మండలంలోని కంసాలిపాలెం గ్రామానికి చెందిన కారింకి ఏసు (33) కూలీపనులు చేస్తూ జీవనోపాధి పొందుతున్నాడు. మృతుడు తరచు అతిగా మద్యం సేవించడంతో కుటుంబ సభ్యులు తాగొద్దని హెచ్చరించారు. దీంతో మనస్థాపానికి గురై ఈనెల 11వ తేదీన పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. చికిత్స నిమిత్తం రాజమహేంద్రవరంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించి వైద్యసేవలు అందిస్తుండగా పరిస్థితి విషమించడంతో మృతిచెందాడు. అతని తండ్రి చిన సుబ్బారావు ఇచ్చిన సమాచారంతో అనుమానస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు పేర్కొన్నారు.

నకిలీల మాయాజాలం



చాగల్లు మండలంలో ఎరువుల దుకాణల్లో తనిఖీలు చేస్తున్న అధికారులు



రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయాధికారులు

- ప్రారంభమైన ఖరీఫ్ సీజన్
- పురుగు మందులు, ఎరువులకు డిమాండ్
- ప్రైవేటు దుకాణాలను ఆశ్రయిస్తున్న రైతులు
- కల్తీ ఎరువులను అంటకడుతున్న వైనం?

చాగల్లు: ఖరీఫ్ సీజన్ ప్రారంభమయ్యింది. వరి, ఉద్యాన పంటల సాగులో రైతులు తలమునకలవుతున్నారు. ఇప్పటికే వరిలోనారుమళ్ల పక్రియ పూర్తవ్వగా నాట్ల పక్రియ విస్తృతంగా సాగుతోంది. పంటదిగుబడిలో ఎరువులు, పురుగుమందుల పాత్ర కీలకం. అంతటి ప్రాధాన్యత కలిగిన ఎరువుల నాణ్యత ప్రశ్నార్థకంగా మారింది. రైతుల అవసరాన్ని అసరాగా తీసుకున్న కొందరు ఎరువుల దుకాణదారులు నకిలీ ఎరువులు విక్రయించి రైతులను నట్టేట ముంచుతున్నారు. దీనిపై అధికారులు స్పందించి తనిఖీలు చేస్తున్న దుకాణదారుల్లో ఎలాంటి మార్పు రావడం లేదు. ఫలితంగా దిగుబడి సక్రమంగా అందక రైతులు ఆందోళన చెందుతున్నారు. ఎరువుల కొనుగోలు విషయంలో జాగ్రత్తలు పాటించాలని వ్యవసాయా శాఖాధికారులు సూచిస్తున్నారు.

కొవ్వూరు నియోజకవర్గంలో ఇలా..

కొవ్వూరు నియోజకవర్గంలో 20,549 హెక్టార్లలో వివిధ రకాల పంటలు సాగు చేస్తున్నారు. అందులో వరి 9,049 హెక్టార్లు, ఉద్యానవన పంటలు 11,500 హెక్టార్లలో సాగులో ఉన్నట్లు అధికారిక లెక్కలు చెబుతు న్నాయి. ప్రభుత్వం అనుమతి పొందిన సుమారు 50 పురుగు మందులు, ఎరువుల దుకాణాలు కొవ్వూరు, చాగల్లు తాళ్లపూడి మండలాల్లో అందుబాటులో ఉన్నాయి. పంటల సాగులో అధిక దిగుబడులు సాధించాలని రైతులు ఎరువులు, పురుగు మందులు అధికంగా వినియోగిస్తున్నారు. అన్నదాతల అవసరాలను సొమ్ము చేసుకునేందుకు కొందరు వ్యాపారులు నకిలీ ఉత్పత్తులను అంటగట్టే అవకాశముందని, అప్రమత్తంగా వ్యవహరించకుంటే మోసపోయే ప్రమాదమం ఉందని ప్రస్తుతం అకస్మికంగా వివిధ ప్రాంతాల్లో వ్యవసాయాధికారులు తనిఖీలు చేపడుతున్నారు.

దళారుల వద్ద కొనుగోలు చేయొద్దు

నిషేధిత మందులు కొనుగోలు చేస్తే రైతులు నష్టపోయే ప్రమాదం ఉంది. కొందరు ఎరువులు, పురుగు మందుల వ్యాపారులు దిగుబడి ఎక్కువగా వస్తుందని నమ్మించి అనుమతి లేని వివిధ కంపెనీల కల్తీ ఎరువులు, పురుగు మందులు అంటగట్టే అవకాశం ఉంది. ముఖ్యంగా అనుమతులు లేని దుకాణాలు, దళారుల వద్ద కొనుగోలు చేయరాదు. తక్కువ ధరకే ఇస్తున్నారని కొని వాడితే పంట దిగుబడి తగ్గడంతో పాటు భూసారం దెబ్బతింటుంది. కొనుగోలు చేసేటప్పుడు మందుల లేబుల్స్ పరిశీలించి, అవి కంపెనీ ఉత్పత్తులా? లేక స్థానికంగా తయారు చేసి విక్రయిస్తున్నారా? అనే విషయాలను తెలుసుకోవాలి. కొనుగోలు చేసినప్పుడు తప్పనిసరిగా సదరు యజమాని సంతకంతో కూడిన రసీదు తీసుకోవాలి. ముఖ్యంగా విత్తనాలకు సంబంధించిన సంచుల సీల్ తొలగించినట్లు గుర్తిస్తే వాటిని కొనుగోలు చేయకుండా అధికారులకు ఫిర్యాదు చేయాలి. పరిశీలనలో అది వాస్తవమని తేలితే సంబంధిత డీలర్స్‌పై1 కేసు నమోదు చేసి రైతులకు న్యాయం చేయడానికి అవకాశం ఉంటుంది.

నకిలీలపై ఫిర్యాదు ఇలా

గ్రామాల్లో ఎవరైనా లైసెన్స్ లేకుండా విత్తనాలు, ఎరువుల, పురుగు మందులు విక్రయిస్తున్నట్లు తెలిస్తే వెంటనే వ్యవసాయ, విజిలెన్స్ అధికారులకు ఫిర్యాదు చేయాలి. మందుల లాట్ నంబర్‌ను బట్టి తయారు చేసిన తేదీని గుర్తించి ఏ కంపెనీ, ఏ రకం వంటి విషయాలను కొనుగోలుదారులు పరిశీలించాలి. వ్యాపారులు నకిలి పురుగు మందులు, ఎరువులు విక్రయించి రైతులను మోసగిస్తే సంబంధిత డీలర్స్‌పై కేసు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటారు.

లైసెన్స్ రద్దు చేస్తాం

> దుకాణాల్లో నకిలీ ఎరువులు, పురుగు మందులు విక్రయిస్తున్నట్లు గుర్తిస్తే దుకాణం లైసెన్స్ రద్దు చేస్తాం. మందులు కొనుగోలు చేసిన రైతులకు దుకాణం పేరుతో పాటు యజమాని సంతకంతో కూడిన బిల్లు తప్పనిసరిగా ఇవ్వాలి. పురుగు మందులు తీసుకునేటప్పుడు డబ్బాపై ఉన్న వివరాలను పూర్తిగా పరిశీలించాలి. నిరక్షరాసులు అయితే, తెలిసిన వారికి చూపించి అది ఏ కంపెనీదో నిర్ధారించిన తర్వాతనే కొనుగోలు చేయాలి. వ్యవసాయాధికారుల సూచన ప్రకారమే మందు పిచికారీ చేయాలి. లేకుంటే పంట దెబ్బతినే ప్రమాదం ఉంది.
>
> – కె.వేణుగోపాల్, మండల వ్యవసాయాధికారి, చాగల్లు

విద్యతోనే అభివృద్ధి



చిన్నారికి అక్షరాభ్యాసం చేస్తున్న తానేటి వనిత

గోపాలపురం: విద్యతోనే అభివృద్ధి సాధ్యమవుతుందని ప్రతి ఒక్కరూ విద్యకు ప్రాధాన్యత ఇవ్వాలని నియోజకవర్గ వైఎస్సార్ సీపీ కన్వీనర్ మాజీ మంత్రి డాక్టర్ తానేటి వనిత అన్నారు. శనివారం మండల ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి ఖండవల్లి సురేష్ కుమార్తె రిషిత, కుమారుడు గౌతంలచే అక్షరాభ్యాసం చేయించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ విద్య, వైద్యానికి వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధ్యక్షుడు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పెద్దపీట వేశారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు వెలగా శ్రీరామమూర్తి, ముచ్చి కర్ల రవి, నాయకులు కూసం రామమోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్లు రద్దుచేయాలి

చాగల్లు: విద్యుత్ సరఫరాలో ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన స్మార్ట్ మీటర్ల విధానాన్ని రద్దు చేయాలని కాంగ్రెస్ ఆధ్వర్యంలో శనివారం నిరసన దీక్ష నిర్వహించారు. జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు టీకే విశ్వేశ్వరరెడ్డి మాట్లాడుతూ గతంలో స్మార్ట్ మీటర్ల విధానాన్ని వ్యతిరేకించిన చంద్రబాబు ప్రభుత్వం, ఇప్పుడు అమలు చేయడం దారుణమన్నారు. విద్యుత్ అధికారులను కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు రఫీయుల్లా బేగ్, పాలకుర్తి ప్రభాకర చౌదరి, బొనిగే రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

అదృశ్యమైన మహిళలు ఎక్కడున్నారు పవన్..?

- సంవత్సర కాలంగా ప్రజలను మోసం చేస్తున్నారు
- వంచనే చంద్రబాబు నైజం



గోపాలపురం బాబు ష్యూరిటీ-మోసం గ్యారంటీలో మాట్లాడుతున్న వనిత

గోపాలపురం: కూటమి ప్రభుత్వం డైవర్షన్ రాజకీయాలు చేస్తూ సంవత్సరకాలంగా ఏపీ ప్రజలను నిలువునా మోసం చేస్తూన్నారని గోపాలపురం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి మాజీ హోం మంత్రి తానేటి వనిత అన్నారు. స్థానిక కూసం రామమోహన్‌రెడ్డి నివాసం వద్ద శనివారం బాబు ష్యూరిటీ మోసం గ్యారంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొని ఆమె మాట్లాడుతూ ఆడబిడ్డనిధి, ఉచిత బస్సు, రైతుభరోసా, కొత్త పింఛన్లు వంటి అమలు కాని హామీలు ఇచ్చి అమలు చేయలేక ఖజనా ఖాళీగా ఉంది అంటూ రాష్ట్ర ముఖ్యమంత్రి మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. ఎంత మంది ఆడబిడ్డలు ఉంటే అంత మందికి రూ.18వేలు జమచేస్తామని చెప్పారు. కానీ ఏఒక్క హామీ కూడా అమలుకు నోచుకోలేదన్నారు.

మహిళల జాడ ఏమైంది..?

రాష్ట్రంలో 30 వేల మంది మహిళలు అదృశ్యమైయ్యారని చెప్పిన పవన్ కళ్యాణ్, కూటమి ప్రభుత్వం ఏర్పడి సంవత్సరం అవుతున్నా ఒక్క మహిళను కూడా ఎందుకు గుర్తించలేదని ప్రశ్నించారు. వాలంటీర్లు డేటానే అమ్ముకుంటున్నారని విమర్శించిన ఇరువురు నాయకులు అదే వాలంటీర్లకు అయిదు వేలు కాదు, పదివేలు ఇస్తామని చెప్పి వారి కడుపు కొట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో 87 లక్షల మందికి అమ్మ ఒడి అందించారని గుర్తు చేశారు. ప్రస్తుతం 87లక్షల నుంచి 67 లక్షల విద్యార్థులకు తగ్గించి ఇస్తున్నట్లు ప్రకటించి చివరికి కేవలం 57లక్షల మందికి మాత్రమే తల్లికి వందనం అందించారని, అందులోనూ కొంత నగదును స్కాం చేశారని, ఈ విధంగా తల్లిబిడ్డలను మోసం చేసిన ఘనత చంద్రబాబుకే దక్కుతుందన్నారు. కూటమి ప్రభుత్వంలోని హత్యా రాజకీయాలు, అరాచక పాలనపై వైఎస్సార్ సీపీ నాయకులు కార్యకర్తలు గ్రామాల్లో రచ్చబండ కార్యక్రమాలు నిర్వహించి ప్రభుత్వం పనితీరును ఎండగట్టి ప్రజలకు వివరించాలని నాయకులకు, కార్యకర్తలకు దిశనిర్దేశం చేశారు. ఎంపీపీ వుండవల్లి సత్యనారాయణ, జడ్పీటీసీ సభ్యురాలు కాకులపాటి లలిత, మండలపార్టీ అధ్యక్షుడు వెలగా శ్రీరామమూర్తి, నాయకులు పోతుల అప్పిరెడ్డి, సాలి వేణు, కాకులపాటి శ్రీను, మల్లిపూడి సలీం, పఠాన్ అన్సర్ భాషా, తోట నాగేశ్వరరావు, మండల వైఎస్సార్ సీపీ గ్రామ సర్పంచ్, ఎంపీటీసీలు, అనుబంధ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

రోజాకు బేషరతుగా క్షమాపణలు చెప్పాలి



యజ్జవరపు లక్ష్మి

నల్లజర్ల: మహిళల రాజకీయ ఎదుగుదలను ఓర్వలేక వ్యక్తిగత దూషణలకు దిగడం తగదని వైఎస్సార్ సీపీ నల్లజర్ల మండల మహిళా అధ్యక్షురాలు యజ్జవరపు లక్ష్మి ఆగ్రహం వ్యక్తం చేశారు. మాజీ మంత్రి రోజాపై నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ సభ్య సమాజం తల దించుకునేలా వ్యాఖ్యలు చేయడం దారుణమన్నారు. ఆమెపై చేసిన వాఖ్యలకు బేషరతుగా క్షమాపణ చెప్పాలని శనివారం మీడియాకు ఓ ప్రకటన విడుదల చేశారు. మహిళలు ఎన్నో అవరోధాలు, అడ్డంకులు ఎదుర్కొని రాజకీయాలలో రాణించాల్సి ఉంటుందన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టాక మహిళలు, చిన్నారులపై దాడులు, అఘాయిత్యాలు పెరిగిపోయాయన్నారు.ఈ క్రమంలో వాటిని ఖండిస్తున్న మాజీ మంత్రి రోజాపై వ్యక్తిగత దూషణలకు దిగడం, చౌకబారు ఆరోపణలు చేయడం ప్రజాస్వామ్యం అనిపించుకోదన్నారు. అధికారం శాశ్వతం కాదని భానుప్రకాష్ లాంటి వారికి ప్రజలు తగిన గుణపాఠం చెప్పడానికి సిద్ధంగా ఉన్నారన్నారు..

హైవేపై ప్రమాదాల నివారణకు చర్యలు

పెరవలి: మండలంలో ఉన్న 13 కిలోమీటర్ల రహదారిని శనివారం జాతీయ రహదారులు అధికారులు, పోలీసులు పరిశీలించారు. ఈ సందర్భంగా నిడదవోలు సీఐ తిలక్ మాట్లాడుతూ అన్నవరప్పాడు, ఖండవల్లి, అన్నవరప్పాడు వేంకటేశ్వరస్వామి గుడి, నల్లాకులవారిపాలెం, రవళి స్పిన్నింగ్ మిల్లు వద్ద, పెరవలిలో ప్రమాదాల స్పాట్‌లుగా గుర్తించామన్నారు. జాతీయ రహదారిపై ఇప్పటి వరకు 15 ప్రమాదాలు జరగగా వీటిలో 8 ప్రమాదాలు అన్నవరప్పాడులోను, 7 ప్రమాదాలు ఖండవల్లి సెంటర్‌లో జరిగాయని తెలిపారు. ముఖ్యంగా అన్నవరప్పాడు, నల్లాకులవారిపాలెం గ్రామ కూడలి వద్ద స్పీడ్ బ్రేకర్లు వేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. పార్కింగ్‌లకు మార్కింగ్‌లు ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సై యం.వెంకటేశ్వరరావు, జాతీయ రహదారి అధికారులు పాల్గొన్నారు.

ఇరిగేషన్ ఈఈ సస్పెన్షన్

నిడదవోలు: విధుల నిర్వాహణలో వైఫల్యం కారణంగా పశ్చిమ గోదావరి పశ్చిమడెల్టా శెట్టిపేట ఈఈ పి.సుబ్రహ్మణేశ్వరరావును జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ఆదేశాల మేరకు ఉన్నతాధికారులు సస్పెండ్ చేస్తూ గురువారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. పశ్చిమడెల్టా శెట్టిపేట ఈఈగా భీమవరం డ్రైయిన్స్ డీఈ సత్యనారాయణకు ఇన్‌ఛార్జి బాధ్యతలు అప్పగించారు. ప్రస్తుతం సెలవులో ఉన్న ఆయన సోమవారం బాధ్యతలు చేపట్టనున్నారు. రబీ పంట అనంతరం నిడదవోలు పట్టణంలో నూతన ఆర్వోబీ నిర్మాణంలో భాగంగా పశ్చిమడెల్టా ప్రధాన కాలువలో అడ్డుకట్ట (క్రాస్‌బండ్) ఏర్పాటు చేశారు. కాకరపర్రు గేటుల వద్ద తోడు తొలగించపోవడం, ఒఅండ్‌ఎమ్ నిధులు విడుదల చేసినా తగిన సమయంలో పనులు చేయకపోవడంతో సాగునీటి కొరత ఏర్పడిన కారణంగా తొలగించామన్నారు.

వెంకటేశ్వర స్వామిని దర్శించిన 7,500 మంది భక్తులు

- పోటెత్తిన భక్తులు
- భారీగా అన్న సమారాధన



ప్రత్యేక అలంకరణలో అన్నవరప్పాడు వేంకటేశ్వరస్వామి అమ్మవార్లు

పెరవలి: అన్నవరప్పాడులో వెంచేసియున్న వేంకటేశ్వరస్వామి ఆలయానికి శనివారం దర్శనానికి వేలాదిగా భక్తులు పోటెత్తారు. స్వామివారికి అభిషేకం నిర్వహించిన అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. స్వామి, అమ్మవార్లను నిమ్మకాయలతో అలంకరించారు. తెల్లవారుజాము నుంచే వేలాదిగా మంది భక్తులు తరలిరావటంతో ఆలయ ప్రాంగణాలు క్యూలైన్‌లతో కిక్కిరిసాయి. దీంతో దర్శనానికి గంటల సమయం పట్టింది. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆలయ అభివృద్ధి కమిటీ ప్రత్యేక చర్యలు చేపట్టారు. స్వామి వారికి తలనీలాలు భక్తులు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. దాతల ఆర్థిక సాయంతో 7,500 మందికి ఉచిత అన్నసమారాధన నిర్వహించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి మీసాల రాధాకృష్ణ మాట్లాడుతూ ప్రతి శనివారం భక్తులకు దాతల సహాకారంతో ఉచిత అన్న సమారాధన నిర్వహిస్తున్నామని, ప్రసాదాలను కూడ ఉచితంగా పంపిణీ చేస్తున్నామని పేర్కొన్నారు. స్వామి వారికి పూలంకరణ, భక్తులకు ప్రసాదం, నిత్యగోత్రార్చన, అన్నదానం వంటి కార్యక్రమాలకై భక్తుల నుంచి విరాళాలు స్వీకరిస్తున్నామని వివరించారు.

నిబంధనలకు లోబడి పండిస్తే లాభదాయకం

దేవరపల్లి: బోర్డు నిబంధనలకు లోబడి పొగాకు పండిస్తే లాభదాయకంగా ఉంటుందని ఐటీసీ వైస్ చైర్మన్ హెచ్‌జీ రవీష్ రైతులకు సూచించారు. ఐటీసీ వైస్ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన సందర్భంగా శనివారం దేవరపల్లి పొగాకు వేలం కేంద్రాన్ని సందర్శించి వేలం ప్రక్రియను పరిశీలించారు. అనంతరం రైతులతో సమావేశమై మాట్లాడుతూ 1990–92 సంవత్సరంలో ఎస్‌ఎల్‌ఎస్ ప్రాంతంలో 9 నుంచి 10 మిలియన్ల పొగాకు పండించే వారని, ప్రస్తుతం 80 మిలియన్ల కిలోలు ఉత్పత్తికి చేరుకుందని ఆయన తెలిపారు. కష్టకాలంలో ఉన్న రైతులను ఐటీసీ ఆదుకొంటుందని, 70 నుంచి 80 శాతం పొగాకు రైతుల నుంచి కొనుగోలు చేస్తున్నట్టు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐటీసీ లీఫ్ మేనేజర్ కొత్రేష్, వేలం కేంద్రం నిర్వహణాధికారిణి పి.హేమస్మిత, వర్జీనియా పొగాకు రైతు సంఘం అధ్యక్షుడు కాట్రు సత్యనారాయణ, పలువురు రైతులు పాల్గొన్నారు.

శాకంబరిగా విజయ కనకదుర్గ అమ్మవారు అలంకరణ

ఉండ్రాజవరం: ఆషాఢం మాసం పురష్కరించుకుని మోర్త గ్రామంలో వేంచేసియున్న శ్రీవిజయ కనక దుర్గమ్మ అమ్మవారు శాకంబరి దేవిగా శనివారం భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా అమ్మవారిని వివిధ రకాల కూరగాయాలు, నిమ్మకాయలు, ఆకుకూరలు, పండ్లుతో విశేషంగా అలకరించారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

ఆచారం మాటున ఆరోగ్య ప్రయోజనం



చేతులకు గోరింటాకు పెట్టుకున్న విద్యార్థినులు

తాళ్లపూడి: ఆడపిల్ల చేతికి గోరింటాకు ఆనందంతో పాటు ఎంతో ఆరోగ్యకరమైందని తాళ్లపూడిలోని శ్రీ విజేత హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు జేవీ ప్రమోద్ అన్నారు. శనివారం విద్యార్థులకు గోరింటాకుపై అవగాహన కల్పిస్తూ ప్రదర్శన ఏర్పాటు చేశారు. ఈ నేపథ్యంలో విద్యార్థులు అందరూ తమ చేతులకు గోరింటాకు పెట్టుకొని కనువిందు చేశారు. ఆచారం మాటున చేతికి పెట్టే గోరింటాకు ఆరోగ్యపరంగా ఎన్నో ప్రయోజనాలకు కలిగి ఉందన్నారు. ఆషాఢ మాసంలో ఆడపిల్లలు తమ చేతులకు, కాళ్లకు గోరింటాకు పెట్టుకొని మురిసిపోవటం వెనుక గల రహస్యాన్ని తెలిపారు. ఆషాఢంలో సాధారణంగా వర్షాకాలంలో వస్తుందని, వర్షాల కారణంగా వాతావరణం ఒక్కసారిగా చల్లబడుతుంది. కానీ మన శరీర వేడిలో వాతావరణానికి తగ్గట్లుగా మార్పులు రావు. కాబట్టి, గోరింటాకు పెట్టుకోవడంతో శరీరంలో వేడి తగ్గి, రోగ నిరోధక లక్షణం కలిగి మనకు ఆరోగ్యకరమైన మార్పులకు దారితీస్తుందని వివరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించాలి

పెరవలి: ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించటమే ఆరోగ్యవంతమైన భవిష్యత్‌కి పెట్టుబడని దీనిపై అందరి సహాకారం కావాలని మంత్రి కందుల దుర్గేష్ పిలుపు నిచ్చారు. పెరవలి మండలం కానూరులో శనివారం స్వచ్ఛాంధ్ర -స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా మానవహారం నిర్వహించి అనంతరం ర్యాలీ నిర్వహించారు. ప్లాస్టిక్ నిషేధం అందరి భాద్యతని వాటి స్థానంలో గుడ్డ సంచులు వినియోగించాలని దీని వలన పర్యావరణం దెబ్బతినదని వివరించారు. ప్లాస్టిక్ సంచులతో భూమిలోకి నీరు ఇంకదని, ఇంట్లోని చెత్తా చెదారాన్ని బయట వేయకుండా వేరు చేయాలని సూచించారు. ప్లాస్టిక్‌ను వినియోగించనని ప్రజలతో ప్రతిజ్ఞ చేయించారు. ప్రస్తుతం వాతావరణం మార్పులతో వర్షాకాలంలో వర్షాలు కురవటం లేదని అధిక ఉష్ణోగ్రతలు నమోదు అవుతున్నాయని తెలిపారు.

దేవరపల్లి: ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించి ప్రజల ప్రాణాలను కాపాడాలని అధికారులు ప్రజలకు విజ్ఞప్తి చేశారు. స్వర్ణాంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని శనివారం మండలంలోని వివిధ గ్రామాల్లో గ్రామ పంచాయతీ అధికారులు నిర్వహించారు. దేవరపల్లిలో పంచాయతీ కార్యదర్శి ఎస్.రవికిషోర్ ఆధ్వర్యంలో ప్లాస్టిక్ నిర్మూలన, ప్రత్యామ్నాయాల వినియోగంపై విద్యార్థులు, గ్రామ సచివాలయ ఉద్యోగులు, సిబ్బంది ర్యాలి నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్‌ను స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్‌ను స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దేటట్లు నా వంతు కృషి చేస్తానని అధికారులు, విద్యార్థుల ప్రతిజ్ఞ చేశారు.

నిడదవోలు: పరిసరాల పరిశుభ్రత అనేది ప్రతి ఒక్కరి బాధ్యతని మున్సిపల్ కమిషనర్ టి.కృష్ణవేణి తెలిపారు. స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం వివిధ శాఖల అధికారులు, స్కూల్ విద్యార్థులు, సచివాలయ ఉద్యోగులతో కలిసి పట్టణంలో ఎండింగ్ ప్లాస్టిక్ పొల్యూషన్ అనే నినాదంతో ర్యాలీ నిర్వహించారు. వీక్లీ మార్కెట్ వద్ద మానవహారం నిర్వహించి, ప్రకృతిని కాపాడుకుందాం-ప్లాస్టిక్ నిర్మూలిద్దాం అంటూ స్వచ్ఛాంధ్ర ప్రతిజ్ఞ చేశారు. మున్సిపల్ వైస్ చైర్మన్ ఎస్‌కే వజీరుద్దీన్, కౌన్సిలర్లు, పాల్గొన్నారు.


భవిష్యత్తు తరాలను కాపాడుకోవాలి

తాళ్లపూడి: సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను నిషేధించి భవిష్యత్ తరాలను కాపాడుకోవాలని ఎంపీడీవో ఎస్.వేణుగోపాల్ రెడ్డి తెలిపారు. మండలంలోని అన్నదేవరపేటలో శనివారం స్వర్ణాంధ్ర -స్వచ్ఛ ఆంధ్ర (సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధం) అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.

గోపాలపురం: ప్లాస్టిక్ వాడకంతో ప్రజలు అనేక రోగాల బారిన పడుతున్నారని అందువల్ల ప్లాస్టిక్ నిరోదానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని ఎంపీడీవో గెలా రాజ్‌మనోహర్ అన్నారు. శనివారం ప్లాస్టిక్ వాడకం, నిరోధం వంటి అంశాలపై అవగాహనా ర్యాలీ నిర్వహించారు. మండలంలోని ప్రతి గ్రామ పంచాయతీలోనూ ప్లాస్టిక్ వాడకాన్ని నిరోధించాల్సిన బాధ్యత ఆయా గ్రామ కార్యదర్శులపై ఉందన్నారు.

ఉండ్రాజవరం: ప్లాస్టిక్ కాలుష్య భూతాన్ని అంతం చేద్దామని ఎంపీడీవో వి.రామారావు, తహసీల్దార్ పీఎన్‌డీ.ప్రసాద్ అన్నారు. మండలంలో చివటం గ్రామంలో శనివారం స్వర్ణ ఆంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు.

వరి చేనుకు ఊపిరి పోసిన వర్షం



ఊనగట్ల వద్ద రోడ్డుపై ప్రవహిస్తున్న వర్షపు నీరు

దేవరపల్లి: నీటి ఎద్దడితో బీటలు వారి ఎండిపోతున్న ఖరీఫ్ వరి చేనుకు వర్షం ఊపిరి పోసింది. శుక్ర, శనివారాల్లో మెట్టలోని పలు ప్రాంతాల్లో కుండ పోత వర్షం కురిసింది. దీంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. దేవరపల్లి, చాగల్లు, గోపాలపురం, నల్లజర్ల మండలాల్లో అత్యధిక వర్షం కురిసింది. దాదాపు నెల రోజులుగా తడిలేక వాడిపోయిన వరి చేలు, కూరగాయల పంటలు ఈ భారీ వర్షాలకు నిలబడ్డాయని రైతులు తెలిపారు.

76.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు

చాగల్లు: మండలంలో కుండపోత వర్షం కురిసింది. దీంతో పల్లపు ప్రాంతాల్లో ఉన్న పంటపొలాలు, రోడ్లపై వర్షపు నీరు చేరింది. శుక్రవారం రాత్రి నుంచి శనివారం వరకు 76.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైదయ్యింది. నిడదవోలు–పంగిడి రహదారిలో బ్రాహ్మణగూడెం, ఊనగట్ల, చాగల్లు తదితర ప్రాంతాల్లో రోడ్లపై వర్షం నీరు ప్రవహించింది. ఊనగట్ల, నందిగంపాడు, చాగల్లు, ఎస్.ముప్పవరం తదితర గ్రామాల్లో పల్లపు ప్రాంతాల్లో పంటపోలాల్లో వర్షం నీరు చేరింది. శుక్రవారం రాత్రి సుమారు 3 గంటలపాటు కురిసిన వర్షానికి రోడ్లపై జనజీవనం స్తంభించింది.

స్వచ్ఛాంధ్ర సాధనకు కృషిచేయాలి

నిడదవోలు రూరల్: స్వచ్ఛాంధ్ర సాధనకు ప్రతి ఒక్కరూ భాగస్వాములై కృషిచేయాలని మండల ప్రత్యేకాధికారి ఎ.దుర్గేష్ అన్నారు. మండలంలోని తాడిమళ్లలో పరిసరాల పరిశుభ్రతకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై శనివారం అవగాహన కల్పించారు. ఎంపీడీఓ జగన్నాథరావు మాట్లాడుతూ ప్రజలు సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలంటే పారిశుద్ధ్యంపై దృష్టిపెట్టాలన్నారు.